నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, శనివారం 3 మే 2025 | BHADRADRI KOTHAGUDEM

# సెటిల్‌మెంట్లు, కమీషన్ల మంత్రులు

- కాంగ్రెస్ ప్రభుత్వానిది అంతా మోసాల పాలనే..
- ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా

బోనకల్లు, మే 2: జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల్లో ఒకరు భూముల సెటిల్‌మెంట్లు చేస్తున్నారని, మరొకరు కమీషన్లు దండుకుంటున్నారని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ఆరోపించారు. రాష్ట్రంలో 16 నెలల కాంగ్రెస్ పాలన అంతా మోసాలతోనే నడుస్తున్నదని, ప్రతీ మంత్రీ ముఖ్యమంత్రిగానే వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. బోనకల్లులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు నివాసంలో శుక్రవారం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు

ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులా మారిందన్నారు. ఆ సభలో కేసీఆర్ కనీసం తన పేరును కూడా ఉచ్ఛరించలేదని సీఎం రేవంత్‌రెడ్డి బాధపడుతున్నారని అన్నారు. రిటైర్డు ఉద్యోగులకు బెనిఫిట్స్ రాకపోవడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించినా కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేయడంతో అకాల వర్షాలతో రైతుల ధాన్యం తడిసిపోతోందని అన్నారు. పదో తరగతి ఫలితాలు విడుదల చేసే క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై విమర్శలు చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. మంత్రుల మధ్య సఖ్యత లేదని, మరోసారి ప్రభుత్వం వచ్చే పరిస్థితి లేదని ఆ పార్టీ ఎమ్మెల్యేలే చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్రానికి మళ్లీ కేసీఆరే శ్రీరామరక్షగా నిలుస్తారని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు రాబోయే రోజుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు బంధం శ్రీనివాసరావు, బానోత్ కొండా, వేమూరి ప్రసాద్, ఇటికాల శ్రీనివాసరావు, కొనకంచి నాగరాజు, పారా ప్రసాద్, మూడావత్ సైదా, ఎంగల కనకయ్య, గద్దల వెంకటేశ్వర్లు, కొమ్మినేని ఉపేంద్ర, షేక్ నజీర్, తాళ్లూరి ప్రేమానందం, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.


# అర్హులను అణగదొక్కి..

## ఇందిరమ్మ ఇండ్లన్నీ కాంగ్రెసోళ్లకే..

**నిరుపేదలైన అర్హులను అణగదొక్కి కాంగ్రెసోళ్లకే ఇండ్లను మంజూరు చేసింది రాష్ట్ర ప్రభుత్వం. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా దాదాపు ఆరుసార్లు సర్వేలు చేసీ చేసీ చివరకు తమ సొంత పార్టీ వారినే లబ్ధిదారులుగా నిర్ణయించింది. ఇందుకు కాంగ్రెస్ కార్యకర్తలు సభ్యులుగా ఉన్న 'ఇందిరమ్మ కమిటీ'లు సంపూర్ణంగా సహకరించాయి. అయితే ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుపేదలు తమ సొంతింటి కల చెదిరిపోవడంతో గుండెపగిలి రోదిస్తున్నారు. కటిక పేదరికంలో ఉన్న తమను కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి గొంతు కోసిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏమిచేయాలో తోచక అధికారుల కాళ్లావేళ్లా పడి వేడుకుంటున్నారు.. అధికారులేమో సర్వేలు చేయడం వరకే మా పని అన్నట్లుగా చేతులెత్తేశారు. ఇదిలా ఉంటే.. ఇదే అదునుగా పేదలను మోసం చేసేందుకు రూ.50 వేలు ఇస్తే ఇల్లు వస్తదంటూ కాంగ్రెస్ నాయకులు బేరసారాలు చేస్తుండడం గమనార్హం. ఏదేమైనా బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ పథకాల ఫలాలు అర్హులందరికీ అందాయని గ్రామాల్లో ప్రజలు చెప్పుకుంటున్నారు.** **–ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, మే 2**

- ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుపేదలకు మొండి'చేయి'
- కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి గొంతు కోసిందంటున్న ప్రజలు
- చేతులెత్తేసిన అధికారులు... సర్వేలతోనే వీరి పని పూర్తి
- లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీలదే తుది నిర్ణయం
- రూ.50 వేలిస్తే ఇల్లు వస్తదంటూ అధికార పార్టీ నేతల బేరాలు
- పైలట్ గ్రామాల్లోనూ నత్తనడకన ఇండ్ల నిర్మాణాలు
- బీఆర్ఎస్ పాలనలో పార్టీలకతీతంగా అర్హులకు ఫలాలు

ఖమ్మం రూరల్: అర్హుల జాబితాలో మొదటగా ఉన్న తన పేరును తరువాత కాంగ్రెస్ నేతలు తొలగించారంటున్న బొమ్మకంటి లలిత



### రేకుల షెడ్డులో ఉంటున్నాం..



మేము రేకుల షెడ్డులో ఉంటున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇల్లు వస్తుందని ఆశతో దరఖాస్తు చేసుకున్నా. గ్రామసభలో ఇండ్ల కోసం ఎంపికైన వారి పేర్లు పెట్టారు. అందులో నాది మొదటి పేరు. తప్పక ఇల్లు వస్తుందని ఆశపడ్డా. కానీ.. మూడు రోజుల నుంచి కాంగ్రెసోళ్లు మళ్లీ సర్వే చేశారు. మా ఇంటికి ఎవరూ రాలేదు. దీని గురించి పంచాయతీ సిబ్బందిని అడిగితే.. మీ పేరు లేకపోవడంతో రాలేదని చెప్పారు. ఇది చాలా అన్యాయం. అధికారులు సర్వే చేసినప్పుడు మా పేరు ఉంది. అధికారులే దయ చూపాలి.

**–బొమ్మకంటి లలిత, తీర్థాల, ఖమ్మం రూరల్**

### మా బాధను అర్థం చేసుకోవాలి..



భర్తకు దూరంగా ఇద్దరు ఆడపిల్లలతో రేకుల ఇంట్లో ఉంటున్నా. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు పెడితే.. గ్రామసభలో నా పేరు వచ్చింది. కానీ.. సర్వే చేయడానికి మా ఇంటికి ఎవరూ రాలేదు. ఎవరికీ తెలియకుండా వచ్చి సర్వే చేస్తున్నారు. ఇంటి గురించి ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు. కూలి పనులకు వెళ్లి పిల్లలను సాకుతున్నా. గురువారం రాత్రి వచ్చిన గాలిదుమారానికి ఇంటి రేకులు లేచిపోయాయి. అధికారులు మా బాధను అర్థం చేసుకొని ఇల్లు ఇవ్వాలి.

**–జర్పుల కృష్ణవేణి, తీర్థాల, ఖమ్మం రూరల్**

### డబ్బులు ఇవ్వలేదని పేరు తీసేశారు..



ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రస్తుత ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మా పూరి గుడిసెను సందర్శించారు. నేను గెలిచిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మొదటగా మీకే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామసభ మొదటి విడతలో మా పేరు ఉంది. నాయకులకు డబ్బులు ఇవ్వలేదని మొదటి జాబితా నుంచి పేరు తొలగించారు. అధికారులు మాకు ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూడాలి.

**–బానోత్ వినోద, బిక్యాతండా, కారేపల్లి**

### పేదోళ్లకు అన్యాయం చేస్తున్నారు..



పూరి గుడిసెలో బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్నాం. మాకు ఎలాగైనా ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతుందని ఎంతో ఎదురుచూశాం. ఇందిరమ్మ ఇండ్ల జాబితా తయారీలో కమిటీ సభ్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. డబ్బులు ఇచ్చిన వారికే ఇండ్లు మంజూరు చేస్తున్నారు. మాలాంటి పేదోళ్లకు అన్యాయం చేస్తున్నారు. అర్హత కలిగిన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలి.

**–గుగులోత్ నగేశ్, బిక్యాతండా, కారేపల్లి**

### నాలాంటి పేదరాలికి కూడా ఇల్లివ్వారా?



మాకు ముగ్గురు పిల్లలు. భర్త ఇంటిని పట్టించుకోడు. బయటనే తిరుగుతుంటాడు. కూలి పనులు చేసుకుని పిల్లలతో బతుకుతున్నాను. కనీసం నీడ కోసం గూడు కూడా ఇవ్వకపోతే ఎలా? మాలాంటి కటిక పేదవాళ్లను కూడా కనికరించకపోతే మేము ఎవరికి చెప్పుకోవాలి? ఉన్నవాళ్లకు ఇండ్లు వస్తున్నాయి. మా ఊర్లో పేదవాళ్లు అధికారులకు కనబడడం లేదు.

**–పల్లపు సుగుణ, బుచ్చన్నగూడెం, అన్నపురెడ్డిపల్లి**

### పేదలకు కాంగ్రెస్ అన్యాయం



కూలి పనులు చేస్తేగానీ మాకు పూట గడవదు. మాలాంటి పేదవాళ్లను చూసినా ప్రభుత్వ అధికారులకు మనసు కరగదా? పేదలకు ఇండ్లు ఇస్తే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుంది.. కానీ అధికార పార్టీ వాళ్లకు ఇస్తే మంచి పేరు ఎలా వస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు న్యాయం చేస్తుందని అనుకున్నాం.. ఇలా అన్యాయం చేస్తుందని ఊహించలేదు.

**–ఇనుపనూరి సరోజ, అయ్యన్నపాలెం, చంద్రుగొండ**

కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల నిర్ణయం.. పేదల పాలిట శాపంగా మారింది. ఓట్లకు ముందు కాంగ్రెస్ నాయకులు చెప్పిన మాటలు నమ్మి ఆ పార్టీని గెలిపించినందుకు తమ గోతి తామే తవ్వుకున్నట్లు ఉందని ప్రజలు బాధపడుతున్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ పథకంలో ఇండ్లు నిర్మించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విధానాలు చూసి తలలు పట్టుకుంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏ సంక్షేమ పథకం అమలు చేసినా పార్టీలకతీతంగా అర్హులందరికీ ఫలాలు అందేవి. బీఆర్ఎస్ నాయకుల ప్రమేయం లేకుండానే డబుల్ బెడ్రూం ఇండ్లు, ఆసరా పింఛన్లు, రైతుబంధు లాంటి ఎన్నో పథకాలు అర్హులకు అందాయి. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా దాదాపు ఆరుసార్లు సర్వేలు చేసి అర్హులను గుర్తించింది. అధికారులు వెల్లడించిన జాబితాలో పేర్లు ఉన్న పేదలు తమకు ఇండ్లు మంజూరయ్యాయని సంతోషంలో ఉండగానే ఇది ఫైనల్ కాదని, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎంపిక చేసిన జాబితానే ఫైనల్ అని నిర్ణయించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు అర్హులను కాకుండా వారికి అనుకూలంగా ఉన్నవారు, కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలను లబ్ధిదారులుగా ఎంపిక చేయడంతో పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నది. దీంతో గ్రామాల్లో ఘర్షణ వాతావరణం నెలకొంది.

**పైలట్ గ్రామాల్లో 1,071 ఇండ్లు మాత్రమే..**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు చేశామని చెప్పింది. కానీ.. ఖమ్మం జిల్లాలో ఐదు నియోజకవర్గాలకు కలిపి 17,500 ఇండ్లు మంజూరు కాగా.. ఇప్పటివరకు పైలట్ గ్రామాల కింద ఎంపిక చేసిన 20 గ్రామాల్లో 1,071 ఇండ్లు మాత్రమే మంజూరయ్యాయి. వీటిలో దాదాపు 320 ఇండ్లు మాత్రమే నిర్మాణ పనులు ప్రారంభించారు.

**కొంతమందికే రూ.లక్ష బిల్లు..**

ఇందిరమ్మ పథకంలో ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారుడికి రూ.5 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుంది. వీటిని నాలుగు విడతలుగా బేస్‌మెంట్ లెవల్ పూర్తికాగానే రూ.లక్ష, రూఫ్ లెవల్‌కు మరో రూ.లక్ష, స్లాబ్ పూర్తికాగానే రూ.2 లక్షలు, పనులన్నీ పూర్తయ్యాక మిగిలిన రూ.లక్ష ఇస్తారు. ఖమ్మం జిల్లాలో ఇండ్ల నిర్మాణ పనులు నత్తనడక నడుస్తుండగా.. ఇప్పటివరకు కొద్దిమందికి మాత్రమే బేస్‌మెంట్ లెవల్‌లో ఇచ్చే రూ.లక్ష బిల్లులు ఇచ్చారు. అయితే ప్రభుత్వం ఇచ్చే సొమ్ముపైనే ఆధారపడిన నిరుపేదలు ఇండ్లు కట్టేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

**పేరుకే అధికారుల సర్వేలు.. ఎంపిక ఇందిరమ్మ కమిటీలదే..**

పేరుకు మాత్రమే అధికారుల సర్వే జరుగుతోంది. అన్ని పంచాయతీల్లో ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలోనే ఇందిరమ్మ ఇండ్ల మంజూరు జరుగుతున్నది. కాంగ్రెస్ నాయకులకు నచ్చినవారికే ఇండ్లు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో రూ.50 వేలు ఇస్తేనే ఇల్లు ఇస్తామని కాంగ్రెస్ నాయకులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నవి. ఖమ్మం జిల్లాలో 569 గ్రామాల్లో ఇప్పటికే 20 గ్రామాలు పైలట్ గ్రామాలుగా ఎంపిక కాగా.. మిగిలిన పంచాయతీల్లో అర్హుల జాబితా రావాల్సి ఉంది.



అన్నపురెడ్డిపల్లి: తాటాకుల ఇంట్లో ఉంటున్న తమకు ఇందిరమ్మ ఇల్లు రాలేదంటున్న పల్లపు సుగుణ

### వితంతుకు కూడా ఇల్లివ్వరా?



వితంతునైనా నాకు ఓ కూతురు, మనవరాలు ఉంది. ఉండేందుకు ఇల్లు లేదు. అద్దె ఇంట్లో ఉంటున్నా. నాకు కుంట భూమి ఉంది. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తే కట్టుకుందామనుకుంటున్నా. నాకు రేషన్, ఆధార్, ఓటరు కార్డు ఉన్నా.. వేరే ప్రాంతం నుంచి వచ్చి బతుకుతున్నావు అంటున్నారు. ఇందిరమ్మ కమిటీ వాళ్లు నాకు ఇల్లు ఇవ్వలేదు. దీనిపై కలెక్టర్, ఎంపీడీవోకు విన్నవించుకున్నా.

**–కొండూరు నాగమణి, పిండిప్రోలు**

మణుగూరు టౌన్: నిధులు రాకపోవడంతో బేస్‌మెంట్ వద్దే నిలిచిన ఇందిరమ్మ ఇల్లు



### నిరుపేదనైనా ఇల్లు రాలేదు..



నిరుపేదలమైన మాకు పూరి గుడిసె ఉంది. అధికారులు సర్వేకు వచ్చినప్పుడు మా గుడిసెను చూసి మీకు ఇల్లు వస్తుందని చెప్పారు. కానీ.. జాబితాలో నా పేరు రాలేదు. మాకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. నాకు ఇల్లు ఎందుకు మంజూరు కాలేదో అర్థం కావడం లేదు. అన్నీ ఉన్న వారికే ఇల్లు ఇవ్వడం ఎంతవరకు సబబు. ప్రభుత్వం నాకు న్యాయం చేయాలి.

**–బట్ట రుక్మిణి, కమలాపురం, మణుగూరు**

### ఇంకెన్ని ఆధారాలు చూపించాలి..



నాకున్న తాటాకుల ఇల్లు వర్షం వస్తే అంతా కురుస్తుంది. మోకాలి లోతు నీరు వచ్చి చేరుతుంది. వర్షం వస్తే మా గోస ఆ దేవుడికే తెలుసు. అధికారులు నీకు ఇల్లు వచ్చిందని చెప్పారు. కానీ.. ఇప్పుడు కొందరికే ఇండ్లు మంజూరయ్యాయని చెబుతున్నారు. మరో జాబితాలో మీకు వస్తుందని అంటున్నారు. మేం నిరుపేదలం అని ఇంకెన్ని ఆధారాలు చూపించాలి.

**–మాటూరి నాగమ్మ, కమలాపురం, మణుగూరు**

### ధనికులకే ఇందిరమ్మ ఇల్లు



బచ్చోడులో భూములు, ఉద్యోగాలు ఉన్న వారికి, ధనికులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చారు. మాలాంటి పేదోళ్లు, దళితులకు ఇండ్లు మంజూరు చేయలేదు. దీని గురించి పంచాయతీ కార్యదర్శిని అడిగితే.. సరైన సమాధానం ఇవ్వడం లేదు. మాకున్న పూడి గుడిసె వానొస్తే అంతా కురుస్తుంది. మా లాంటి నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకపోవడం అన్యాయం. అధికారులు మాపై దయచూపాలి.

**–దారమళ్ల రాణి, బచ్చోడు, తిరుమలాయపాలెం**

### కమిటీలను రద్దు చేయాల్సిందే..



మాది రేకుల ఇల్లు. మేము ఏ పార్టీలో లేము. నిరుపేదలమైనప్పటికీ మాకు ఇల్లు ఇవ్వలేదు. ఉన్నోళ్లు, ధనికులకే ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చారు. ఎవరికీ న్యాయం చేయని ఇందిరమ్మ కమిటీలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి. ప్రభుత్వ అధికారులే గ్రామాల్లో ఇంటింటి సర్వే చేసి ఇండ్లు మంజూరు చేయాలి. మాకు జరిగిన అన్యాయంపై ఎంపీడీవోకు ఫిర్యాదు చేశాం. ఇండ్ల విషయంలో మా పేదలకు న్యాయం చేయాలి.

**–నందిపాటి రేణుక, బచ్చోడు, తిరుమలాయపాలెం**

### పైలట్ గ్రామాల్లో ఫైటింగ్..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 22 మండలాల్లో 22 గ్రామాలను పైలట్ గ్రామాలుగా ఎంపిక చేసి 3,186 ఇండ్లను మంజూరు చేశారు. అయితే ఆయా గ్రామాల్లో నిరుపేదలను విస్మరించి కాంగ్రెస్ పార్టీ వారికే ఇండ్లను మంజూరు చేయడంతో ఫైటింగ్‌లు ప్రారంభమయ్యాయి. రెండో జాబితాలో మీ పేర్లు వస్తాయని అధికారులు నచ్చచెబుతున్నప్పటికీ జిల్లావ్యాప్తంగా బాధితులు ప్రతిరోజూ నిరసన వ్యక్తం చేస్తున్నారు.



అది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం మర్రిగూడెం పంచాయతీ పరిధిలోని బుచ్చన్నగూడెం. గ్రామంలో పెద్దారపు లాలుది నిరుపేద కుటుంబం. అతడికి భార్య ఉన్నా మతిస్థిమితం లేకపోవడంతో బయటనే తిరుగుతుంటుంది. వీరికి ఇద్దరు కుమారులు షర్‌బద్దీన్, అబ్దుల్లా. కూలిపని చేస్తేకానీ పూట గడవదు. మొన్నటివరకు తాటాకుగుడిసె ఉండగా.. వానకు కురుస్తుందని రేకులు వేసుకున్నారు. అంతకుమించి ఆ కుటుంబానికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. కానీ ఈ కుటుంబానికి కూడా ఇందిరమ్మ ఇల్లు రాలేదు.

## గాండ్లగూడెంలో ఇండ్ల సర్వే అడ్డగింత

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 2: ఎకరాలకొద్దీ భూములు, ట్రాక్టర్లు ఉన్న వారికే ఇండ్లు ఇస్తారా? భూమి లేని నిరుపేదలు అర్హులు కాదా? ముందస్తు సమాచారం ఇవ్వకుండా సర్వే కోసం ఎలా వస్తారు? అని ప్రశ్నిస్తూ అశ్వారావుపేట మండలం గాండ్లగూడెం గ్రామస్తులు సర్వేకు వచ్చిన పంచాయతీ కార్యదర్శిని శుక్రవారం అడ్డుకున్నారు. అసలు ఇందిరమ్మ కమిటీ సభ్యులను ఎవరు నియమించారు? వారు గ్రామంలో తిరిగి నిరుపేదలకు గుర్తించారా? అని నిలదీశారు. ట్రాక్టర్లు, భూములు ఉండి.. తమకు అనుకూలంగా ఉన్న వారి పేర్లతో



పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తున్న గ్రామస్తులు

జాబితా రూపొందించారని నిరుపేదలు ఆరోపించారు. నిరుపేదల కోసం ప్రభుత్వం 34 ఇళ్లు మంజూరు చేస్తే కాంగ్రెస్ నేతలు తమకు అనుకూలంగా ఉన్న వారి పేర్లు రాసుకొని నిరుపేదలకు అన్యాయం చేశారని ఆరోపించారు .

## అనర్హుల పేర్లు తొలగించాలంటూ ధర్నా

జూలూరుపాడు, మే 2: ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అనర్హుల పేర్లు తొలగించి అర్హులకే ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూలూరుపాడు మండలం గుండెపుడి గ్రామస్తులు బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఇండ్ల జాబితాలో తమకు అన్యాయం జరిగిందని నిరుపేద మహిళలు పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. భవనాలు, భూములు ఉన్న వారికి ఇండ్లు ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెప్పిన పేర్లు రాసుకొని కనీసం విచారణ



పంచాయతీ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

చేపట్టకుండా అర్హుల జాబితాను ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారికి ఇండ్లు మంజూరు చేయాలని గ్రామస్తులు, ఆయా పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మణుగూరు టౌన్: జాబితాలో పేరు లేదనడంతో పునాదుల్లోనే నిలిచిన ఇల్లు



మణుగూరు టౌన్: సర్కారు మాట నమ్మి ముగ్గు పోసుకున్న దివ్యాంగుడు





కొత్తగూడెం: పరదాలు కట్టుకొని బతుకుతున్న నిరుపేదకూ రాని ఇందిరమ్మ ఇల్లు



కారేపల్లి: తాను ఎమ్మెల్యే కాగానే ఇందిరమ్మ ఇల్లు ఇస్తానంటూ బిక్యాతండాకు చెందిన బానోతు వినోద కుటుంబానికి హామీ ఇస్తున్న రాందాస్‌నాయక్ (ఫైల్), కానీ వారికిప్పుడు ఇల్లు రాలేదు

# అర్ధరాత్రి వర్షం.. అంతులేని నష్టం..

- కూసుమంచిలో అకాల వర్షం.. తీవ్రంగా నష్టపోయిన రైతాంగం..
- ఈదురుగాలులకు కొనుగోలు కేంద్రాల్లో ఎగిరిపోయిన టార్పాలిన్లు
- నీట మునిగిన ధాన్యం రాసులు.. నేలరాలిన మామిడి కాయలు..



కూసుమంచి మండలంలోని రంగారావు తోటలో నేలరాలిన మామిడి కాయలు

కూసుమంచి/ తిరుమలాయపాలెం, మే 2: 'మా ఆరుగాలపు శ్రమ ఫలించింది. పంట చేతికొచ్చింది. తేమ కోసం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబెట్టాం. ఒకటి రెండు రోజుల్లో కాంటాలు వేస్తే ఇక ఫలితం చేతికొచ్చినట్లే..' అనుకున్న అన్నదాతలను గురువారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం అంతులేని నష్టాన్ని మిగిల్చింది. కూసుమంచి మండలంలో నష్ట తీవ్రత అధికంగా ఉంది. చేగొమ్మ గ్రామంలో ధాన్యపు రాసులు నీట మునిగాయి. గాలిదుమారానికి ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు ఎగిరిపోయాయి. వర్షానికి ధాన్యమంతా తడిచిముద్దయింది. అలాగే, మరో 10 రోజుల్లో కోయాల్సి ఉన్న మామిడి పండ్లు కూడా ఈదురుగాలులకు నేలరాలాయి. కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లోనూ, కల్లాల్లోనూ ఉన్న ధాన్యం తడిసి ముద్దయింది. తన ఏడాది కష్టాన్ని సుమారు గంటపాటు వచ్చిన ఈదురు గాలి, వర్షం నేలపాలు చేశాయంటూ గట్టుసింగారానికి చెందిన మామిడి కౌలు రైతు ఎస్కే అలీ ఆవేదన వ్యక్తం చేశాడు. రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఉద్యాన వన శాఖ అధికారులకు తెలియజేశానన్నాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరాడు.





కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామంలోని కల్లాల్లో ధాన్యం రాసుల మధ్య నిలిచిన వర్షపు నీరు